శ్రీరస్తు

శ్రీకృష్ణశతకము

మహాకవి దాసు శ్రీరాములు

(ఏప్రిల్ 8, 1846 – మే 16,1908)

Sree Krishna Satakamu
by
Mahakavi Dasu Sree Ramulu

శ్రీకృష్ణ శతకము

మహాకవి దాసు శ్రీరాములు
శ్రీ దేవీ భాగవతము నుండి ప్రత్యేక సంకలనము 2024

డా. దాసు అచ్యుతరావు
© మహాకవి దాసు శ్రీరాములు స్మారకసమితి
ఫ్లాట్ నెం. 201 శ్రీ సాయిరామ్ ఆదిత్యా రెసిడెన్సీ,
ఇంజనీర్స్ కాలనీ, ఎల్లారెడ్డిగూడ, హైదరాబాద్ - 500 073.
ఫోన్ : 040-23734864, 9490023947
email : araodasu@gmail.com

డి.టి.పి.
సమంత గ్రాఫిక్స్
హైదరాబాద్.
ఫోన్ : 9849551462



మహాకవి దాసు శ్రీరాములు

(ఏప్రిల్ 8, 1846 – మే 16,1908)

నివేదన

శ్రీకృష్ణశతకము

శతావధని బ్రహ్మశ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశస్త్రి గారిచే రెండవ శ్రీనాధునిగా, శ్లాఘించబడిన దాసు శ్రీరాములు గారు 19వ శతాబ్దము ఉత్తరార్ధమున ఉదయించిన యాంధ్రకవులలో, సరసకవి,విద్వత్కవి,ఆశుకవి,దాత,నేత అని ప్రస్తుతింపబడుతూ ప్రత్యేక స్థానం పొందినట్టి మహాపురుషుడు. ప్రముఖ న్యాయవాది, సంఘసంస్కర్త, వాగ్గేయకారుడు, మహాకవిగా ఆంధ్రదేశంలో సంగీత,సాహిత్య,సాంస్కృతిక,సాంఘిక,రాజకీయ రంగాలను ప్రభావితం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి దాసు శ్రీరాములు ఏప్రిల్ 8, 1846న కూరాడ గ్రామంలో జన్మించారు. కృష్ణాజిల్లా,ముదినేపల్లి మండలంలో అల్లూరి అగ్రహారీకులు, సంపన్న కుటుంబీకులు కన్నయ్య, కామమ్మ పుణ్యదంపతులకు ఏకైకసంతానం. స్వయంకృషితోనే విద్యాభ్యాసం చేస్తూ సంస్కృతాంధ్ర భాషల్లో పండితులై, కొంతకాలం గుడివాడ, కౌతారం, డోకిపఱ్ఱులలో ఉపాధ్యయునిగా పని చేశారు. ఉపాధ్యయునిగా పనిచేస్తూనే వారు ఇంగ్లీషు భాష స్వయంకృషితో నేర్చుకుని, ప్రావీణ్యం సంపాదించి ప్లీడరీ పరీక్షలు పాసై 1878 లో బందరులో కొంతకాలం న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసి తర్వాత ఏలూరులో సబ్ కోర్టు ప్రారంభింప బడటంతో 1883 లో అక్కడికి వెళ్ళి న్యాయవాదవృత్తి 1895 వరకు కొనసాగించారు. తర్వాత తమకాలాన్ని పూర్తిగా సాహిత్యం, సమాజ సేవలకు వినియోగించారు. ప్రబంధాలు, పురాణాలు, నాటకాలు, శతకాలు, ధర్మశాస్త్రగ్రంధాలు, కృతులు, జావళీలు, పదములు, యక్షగానాలు మొదలైన వైవిధ్య ప్రక్రియలలో ముప్పదికి పైగా గ్రంధాలు రచించారు. వారి రచనలో చివరది మకుటాయమానమైన ‘శ్రీ దేవీభాగవతము’ ఆశుకవితాధారగా ఐదున్నర నెలల స్వల్పకాలంలో అనువదించారు. మే 16,1908 న పరమపదించారు.

అంతటి మహనీయుని రచనలను పునర్ముద్రించి సాహితీ ప్రపంచానికి అందించాలనే ఉద్దేశ్యంతో ’మహాకవి దాసు శ్రీరాములు స్మారక సమితి’ ని

1973 సంవత్సరములో స్థాపించి ఇంతవరకు వాటిలో ప్రస్తుతం లభ్యమౌతున్న 'తెలుగుఁనాడు', 'అభినవగద్యప్రబంధము', 'శ్రీ దేవీభాగవతము', 'సూర్యశతకము', 'కురంగగౌరీశంకర నాటిక', 'చక్కట్ల దండ', 'భృంగరాజ మహిమ, శ్రాద్ధ సంశయ విచ్ఛేది', 'దురాచార పిశాచ భంజని, ఆచారనిరుక్తి, విగ్రహారాధన తారావళి', 'కృతులు, పదములు, జావళీలు', 'అభిజ్ఞాన శాకుంతలము', ప్రచురించాము. ఇవేకాక, 'మహాకవి దాసు శ్రీరాములు జయంతి సంచిక (1975), 'మహాకవి దాసు శ్రీరాములు గారి కృతులు–ఒక సమీక్ష' శ్రీమతి వెలగపూడి వైదేహిగారి పుత్రిక శ్రీమతి పి. హెచ్ డి సిద్ధాంత వ్యాసము, మహాకవి గారి ఏకైక కుమార్తె వేమూరి (దాసు) శారదాంబ ఒక శతాబ్దమునకు పూర్వము రచించిన 'మాధవశతకము' మరియు 'నాగ్నజితీపరిణయము' ప్రచురించాము.

శతకములు

సమకాలిక సాహిత్య ప్రక్రియలన్నిటిలోను దాసు శ్రీరాములు గారు రచనలు చేశారు. వాటిలో 'శతక ప్రక్రియ' కూడా ఒకటి. ముఖ్యముగా చెప్పవలసినవి 1, సంస్కృతభాషలో 'కామాక్షి శతకము' (అలభ్యము), 2. మయూరుని 'సూర్యశతకము' నకు తెలుగు అనువాదము, 3. తెలుగులో సోమలింగ శతకము, చిలుకలకొలికి శతకము, ముద్దులగుమ్మ శతకము (అలభ్యము). 4. అచ్చ తెలుగులో 'చక్కట్లదండ' అను నీతి మాలిక, మరియు 5. 'శ్రీ దేవీభాగవతమ' నవమ స్కంధములో గంగోత్పత్తి క్రమములో 'భగీరథకృత 'శ్రీ కృష్ణస్తవము' గా 'శ్రీకృష్ణశతకము'.

గంగోత్పత్తి క్రమము

పవిత్ర గంగానదిని స్వర్గం నుండి భువికి తీసుకు వచ్చిన మహాముని భగీరథుడు. భారతీయ సాహిత్యంలో ఈ సంఘటనకు సంబంధించిన పురాణగాథ ఈవిధంగా ఉంది. సూర్యవంశపు రాజైన సగరునకు కేశిని, సుమతి అను ఇద్దరు భార్యలు. కేశినికి అసమంజసుడను ఒక కుమారుడు, సుమతికి 60,000 మంది కుమారులు కలిగారు.

భగీరథుని ముత్తాత అయిన సగర రాజు ఒకసారి అశ్వమేధ యాగం చేస్తాడు. అయితే ఆ యాగ అశ్వాన్ని ఇంద్రుడు దొంగిలించి, పాతాళంలో కపిల మహర్షి తపస్సు చేస్తున్న ప్రదేశంలో నిర్భందిస్తాడు. సగరుని అరవై వేలమంది కుమారులు పాతాళంలో నిర్భంధించి ఉన్న అశ్వాన్ని కనుగొంటారు. అప్పుడు వారు తమబొంగురు శబ్దాలతో కపిలమహర్షిని కలవరపరుస్తారు. కోపోద్రిక్తుడైన కపిలమహర్షి సగరుని అరవైవేల మంది కుమారులు మహర్షి నేత్రాగ్నులచే బూడిదగా మారతారు. వారికి ఉత్తమ గతులు లభించాలంటే దివినుండి గంగను పాతాళానికి తేవలసి ఉంది. అది పొందేవరకు సగరుని కుమారుల అంత్యక్రియలు నిర్వహించే బాధ్యత తరతరాలుగా సంక్రమించింది. సగరుడు, అతని కొడుకు అసమంజసుడు తపసు చేసినా ప్రయోజనం లేకపోయింది. అసమంజసునికొడుకు అంశుమంతుడు. అంశుమంతుని కొడుకు దిలీపుడు. అతనికుమారుడు భగీరథుడు.

పరమభాగవతశ్రేష్ఠుండు గుణవంతుండు విష్ణుభక్తుండైన భగీరథుడు తన తాతలకు ఉత్తమగతులు ప్రాప్తించాలని, గంగానయనార్ధంబు ప్రార్థించడానికి హిమాలయాల్లో అనేక సంవత్సరాలు తపస్సు చేస్తాడు. అప్పుడు భక్తుని అనుగ్రహిస్తూ శ్రీకృష్ణభగవానుడు ఇలా సాక్షాత్కరించాడు.

చ. మునుదల వ్రేళ్ళ నెత్తుచును మూయుచు షడ్జముఖ స్వరాళి సొం
పెనయగజేసి కెంబెదవి నీలకు రానిడి బిల్లc గ్రోవితో
బనివడి రాగముం గృతియు బాడుచు నౌదలc బింఛలాంఛనం
బొనరగ గొల్లపిల్లడయి యోపికతో జనుదెంచె మెల్లనన్.

సీ. బ్రహ్మస్వరూపుడై పరిపూర్ణు డగువాడు స్వేచ్ఛామయుండయి చెలగువాడు
బ్రహ్మరుద్రాదులు బట్టజాలనివాడు మునిపూజితులలోన మొదటివాడు
నిరుపమనిర్లిప్త నిర్గుణుండగువాడు నఖిలజగత్సాక్షి యైనవాడు
ప్రకృతి మాయకు బరుడై వెలయువాడు నిత్యుడై సత్యుడై నిలుచువాడు

తే.గీ. లోకములనెల్ల నొక్కడై సాకువాడు, భక్తరక్షణ దన యనురక్తి మీర
గడగి గోపాలబాలకాకార మూని వచ్చె, జిరునవ్వు నవ్వుచు నచ్చటికిని.

ఇట్లు సాక్షాత్కరించిన శ్రీకష్ణభగవానుని దర్శించి పరవశుడై స్తోత్రం చేశాడు భగీరధుడు. ఆ స్తోత్రాన్ని 'శ్రీ కృష్ణ స్తవము' గా "కృష్ణా భక్తకల్పద్రుమా!" అనే మకుటంతో శ్రీరామకవి శతకం రచించారు. భక్తిరస, అద్వైత భావ సంభూషితమైనది ఈశతకము, శ్రీ దేవీభాగావత ఉద్గ్రంధములో అంతర్భాగ మవటము వలన ఈశతకము భక్తులకు సామాన్యంగా చదువుకునటకు సులభంగా అందుబాటులో ఉండదు. ఆ ఇబ్బంది లేకూండా భక్తులకు వీలు కలిగించుటక దీనిని విడిగా సంకలనము చేసి అందచేస్తున్నాము.

మహాకవి దాసు శ్రీరాములు విరచిత 'శ్రీకృష్ణ శతకము' ను విశ్లేషిస్తూ, విశధీకరిస్తూ, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారు అత్యంత విలువైన పీఠిక 'అభినందన' గా అందించారు. వారికి మాహృదయపూర్వక కృతజ్ఞతలు.

భవదీయుడు

డా. దాసు అచ్యుత రావు 26-04- 2024

హైదరాబాద్

అభినందన

మహాకవి దాసు శ్రీరాములు గారు తిరుపతి వేంకటకవులకు సమకాలికులే. మిగతా అన్ని సాహిత్య ప్రక్రియలలోనూ వారిలాగానే వీరూ అనేక రచనలు చేశారు. జావళీల జాను తెనుగు రచనలు శ్రీరాములుగారికి అదనం. తిరుపతి వేంకటకవులకు నాటక పద్యాలు ప్రసిద్ధి కూరిస్తే, వీరికి "తెలుగునాడు" పద్యాలు ఖ్యాతి గడించి పెట్టాయి. వైదుష్యాలు అలా ఉండగా, వీరు న్యాయవాదవృత్తిలో ఉండికూడా మూడుపదులు పైగా గ్రంధాలు రచించడం వీరి ప్రతిభా వ్యుత్పత్తులకు నిదర్శనం.

దేవీభాగవతం ఆంధ్రీకరణమనేది ఆజంటకవులకూ వీరికీ ఉన్న మరో పోలిక. వీరి దేవీభాగవతానికి చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు "ముందుమాట" అందించడం వీరి పరస్పర స్నేహ సౌజన్యాలకు నిలువుటద్దం. ఆ దేవీభాగవతంలోనిదే ఈ "శ్రీకృష్ణశతకం". భగీరథుడు తన ప్రయత్నాన్ని సానుకూల పరచమని భగవంతుణ్ణి స్తుతించాడు. భగీరథుడిలో దాసు శ్రీరాములుగారు ప్రవేశించారు. సంస్కృత మూలం కాసేపు తెరచాటుకు వెళ్ళింది. "కృష్ణా! భక్తకల్పద్రుమా!" అనే మకుటంతో వంద పద్యాలు జాలువారాయి. ఇలా అదొక ప్రత్యేక శతకమై కూర్చుంది.

దేవీభాగవతం కథాకాలానికీ ఈ పద్యాలకూ ఏ సంబంధమూ లేదు. ఆది- మధ్య- అంతాలలో మాత్రమే భగీరథుడు కనిపిస్తాడు. శిల్పపరంగా ఈ శతకం అవిభాజ్యం అనడానికి ఇవి మూడూ మేకు బిగింపులు.

శ్రీకారంతో ప్రారంభంకాని తొలి పద్యం 'నానాలోక నికాయముల్' అన్నదొకటి, 'ధరణిన్ బెబ్బులి గాంచి' (47) అన్నదొకటి, 'పినతాతల్ కపిలర్షి శాపమున' (101) అనే ముగింపు పద్యమొకటీ– ఈ మూడింటా భగీరథుడు కనిపిస్తాడు. కావ్యశిల్పరీత్యా ఈ బిగింపులుచాలు. కృష్ణదేవరాయలవారు విజృంభించి చేసిన ఋతుపుర వర్ణనలకు కావ్యంతో ఐక్యానుసంధనానికి మన పెద్దలు చెప్పిన ఉపాయం ఇదేకదా!

మకుటాన్నిబట్టి – అన్నీ మత్తేభ శార్దూలాలే. అందునా కృష్ణాలోని చివరి సంయుక్తాక్షరం యతి స్థానంలో నిలుస్తుంది. ఆ పదం సంబోధన. అంటే – స్వరయతి. షకారంతో (చవర్గ+శషస) వ్యంజనయతి, అలాగే నకారంతో (బిందుపూర్వక తవర్గీయాలుఞనణలు etc) వ్యంజన యతి – ఇది త్రివిక్రమ యతి మైత్రి. కాబట్టి పద్యంలోని నాల్గోపాదం మొదటి అక్షరం ఎంపికలో కవిగారికి ఇంచుమించు

అనిర్బంధ స్వేచ్ఛ. ఎంతటి గడసరి!!! కవిగారు వృత్తిరీత్యా వకీలు. వీరి ఈ వృత్తిధర్మం – భావాల పోహలింపులోనూ కనపడుతుంది. అది తరవాత చూద్దాం.

నకారం – ద్విత్వం – సంయుక్తం – ఇవి ప్రాసలుగా ఉన్న పద్యాలలో వీటి నిర్వహణలో వీరి ప్రజ్ఞ ఆహాపుట్టిస్తుంది. మూడో పద్యంలో మూడో పాదంలో 'ఏనిన్నాటున్' అని ద్విత్వ నకార ప్రాసను కూర్చడం; ఐదో పద్యంలో 'అట్లైనన్ – కానన్' –అని ప్రాస సాధించడం, ముప్ఫైయ్యొకటవ పద్యంలో– 'ఆనందంబున' అని ప్రారంభించి–రెండో పాదం ప్రాసస్థానంలో "కిల్బిషాత్మానమ్మామవ" అంటూ సంస్కృతాన్ని పొదగడం – ఇత్యాదులు పద్యవిద్య ఎరిగినవారికి ముచ్చటగొల్పుతాయి.

73వ పద్యం 'కృత్యాకృత్యవిచారం' తో ప్రారంభమయ్యింది. 'జాత్యంధుంబలె–భృత్యత్వంబు' అనే వాటితో రెండు – మూడు పాదాల ప్రాస నడిచింది. నాల్గో పాదంలో "నిష్పత్త్యుద్దాముడనౌట" అని ప్రయోగించారు. 'నిష్పత్తి+ఉద్దాముడు–నిష్పత్త్యుద్దాముడు' – తకార ద్విత్వం అయింది. కచ్చితంగా మాట్లాడితే త్య–త్త్య లకు ప్రాస మైత్రి కుదరదు. కానీ తెలుగువారి లేఖన సంప్రదాయంలో ఇదొక వైచిత్రి.

ముత్తియము–కన్నియ మొదలైన వాటిలో 'ఇత్వం' లోపించినప్పుడు 'ముత్యము –కన్య' అని రాస్తామే తప్ప శాస్త్రీయంగా ద్విత్వంతో ముత్త్యము – కన్న్య అని లిఖించడంలేదు. దీన్ని గుర్తించిన వ్యాకరణ సంహితా సర్వస్వకారులు మనకొక సూత్రంలాంటి వాక్యం అందించారు. హలంతర సంయోగంబునందు సజాతీయంబైన హల్లులలో ఒక్కటి మాత్రమే శేషించియుండు – అన్నారు. యకారంతో సంయోగం పొందుతున్నప్పుడు సజాతీయ హల్లులలో (తకార ద్విత్వం – నకార ద్విత్వం) ఒక్కటే మిగులుతుంది. ఒక తకారం పోయి ఒక తకారం మిగిలి – ముత్యము, ఒక నకారం పోయి ఒక నకారం మిగిలి – కన్య అనే రూపాలు ఏర్పడ్డాయి. ఇదే నియమాన్ని అనుసరించి సంస్కృత పదంలోకూడా ఒక తకారం పోయి ఒక తకారం మిగిల్చి 'నిష్పత్త్యుద్దాముడు' అని లిఖించడంలో ప్రాసమైత్రి కుదిరినట్టయ్యింది. 'అతియల్ప ప్రాణి' (15) అనే చోట సంధి చెయ్యకపోవడం కూడా వాడుక బలంతో దొర్లినదే. "అతి" అనే దాన్ని మనం స్వతంత్ర పదంగా వాడేస్తున్నాం. అతిగాడు–అతివాగుడు – అతి చెయ్యక – ఇలా ఎన్నో! సిద్ధసమాసం కనుక "అత్యల్పప్రాణి" అనవలసిందే. కానీ అతిమీద ఊనిక మన వాడుక. 'వనితా రమ్యాననా

వీక్షణాదులపై(23) అనే సమాసం (ఆననా), 'మృడానీభర్త' అనే ప్రయోగం (74) పండితుల ఆలోచనకు పనికలిపిస్తాయి. 'భుజంగప్రాశి పింఛావతంసము' (38), రాధావామాధరబింబకీర (100) – ఇలాంటి సమాసాలు దాసు శ్రీరాములుగారి గ్రథన కౌశలానికి నిలువెత్తు నిదర్శనాలు.

శతకమనేది ఆత్మాశ్రయ కవితా శాఖకు చెందినది కనక నిసర్గ భక్తిధార జాలువారిన పద్యాలు పాఠకులకు తాదాత్మ్యం కల్గిస్తాయి. ఈ శతకంలోనూ వీటి సంఖ్య ఎక్కువే. అన్నిటినీ ఉదాహరించి పుటలు నింపడమూ, పాఠకుల భాగస్వామ్యానికి ఏమీ మిగల్చక పోవడమూ పీఠికా కర్తలకు భావ్యం కాదు కనుక కొన్నిటిని సంఖ్యాపరంగా సూచించి సంతృప్తి చెందుతాను. 'చీమన్ దోమన్' (11),' 'కొఱుదుం గోడన' (19), 'కాకిన్ కోయిల '(21), 'తోలుం బొమ్మకు'(34), 'నీమాటల్' (35), 41 నుంచి 78 దాకా ఈ పద్యాలు అన్నీ అత్యంత మనోహరాలు. సర్వాత్మనా కవితా బంధురాలు.

కవిగారి వకీలు వృత్తి ధర్మాన్ని స్ఫురింపజేసే ఒకటి రెండు పద్యాలు మచ్చుకి చూపుతాను. – "దేవా! నన్ను సృష్టించింది నువ్వు. కాబట్టి నాకృత్యాకృత్యాలకు కర్తవు నువ్వే కావాలి. నన్ను కర్తను చేస్తావేమిటి? ఇది కేవలం నీ మాయ!!" (17). ఇదే ధోరణి 20–60 పద్యాల్లోను తళుక్కుమంటుంది.

కవితా ప్రియులకు విందుభోజనం ఈ శ్రీకృష్ణశతకం. మహాకవి దాసు శ్రీరాములుగారి రచనలన్నిటినీ పునర్ముద్రిస్తూ తాము ఋణవిముక్తులవుతూ మనల్ని ఋణగ్రస్తులను చేసుకొంటున్న డా. దాసు అచ్యుతరావు గారికి అభినందనలతో సెలవు –

విశాఖపట్నం **బేతవోలు రామబ్రహ్మం**

530013 18-02-2024

శ్రీకృష్ణశతకము

శ్రీ దేవీభాగవతము నవమస్కంధములో

భగీరథకృత శ్రీకృష్ణస్తవము

శా. నానాలోక నికాయముల్ కడుపులోనన్ నిల్పి యిచ్ఛావిధా
నానూన ప్రతిభామయుండవయి మాయామోహవిభ్రాంతి సం
ధానంబుం గలిగించి యింతపని పూన్గ వేడ్క నీకేటికిన్
గాన్గ మూఢుని జేయనేల నను గృష్ణా భక్తకల్పద్రుమా. 1

శా. నవ్వందోచు సమస్త వై ధనమహాండంబుల్ ముఖాంభోజమున్
రవ్వంతన్ ముకుళింప నన్నియును గానన్రావు లోకాళికిం
బువ్వం బెట్టెడివాడ వీవకద సంపూర్ణప్రభావాఢ్య మా
యవ్వా రాధిక నీకు గూర్మిసతి కృష్ణా భక్తకల్పద్రుమా. 2

శా. నన్ను న్నీచు దురాత్ము నొక్కని భువిం గల్గించి సంతాప సం
చ్ఛన్నుఁ జేయగనేల ధర్మమగునే నాతండ్రి యెవ్వాడ యే
ని న్నాటు న్నవపాదపాంకురము దా నీరీక యెండించ డ
న్నన్నా పాత్రుడ గాక పోతినొకొ కృష్ణా. 3

శా. ధర్మంబుల్ భవదివ్య వాగ్విదితముల్ తండ్రీ యిదేధర్మ మీ
దౌర్మానుష్యము కామముఖ్యరిపువేధల్ నాకు గల్గించి నీ
కర్మంబంచు దొలంగియుంటివి పరాకా వింతకా దుర్వ్యథాం
తర్మగ్నుండను నన్ను బ్రోవుమిక కృష్ణా. 4

శా. నేనై యున్నది నీవు నీవనగ నేనేకాదె వేరెద్ది యెం
దేనిం బోయి కనుంగొన్గ సకలమం దీవొప్పి యున్నాడ వ
ట్లైన్గ నీవఖిలజ్ఞతాయుతుడ వేనజ్ఞుండ నీ చిత్రమున్
గాన్గ లోకవిరుద్ధ ధర్మమగు కృష్ణా. 5

శా. కన్నుల్ నాలుక ముక్కునుం జెవు లొడల్ గల్గించి తిందేమి సం
పన్నత్వంబు లభించెనాకు ద్రిగుణ ప్రారబ్ధ కర్మాళిచే
ఖిన్నత్వంబును బొంది జన్మసమితిం గెంటం గతింగాన న
న్నన్నా న్యాయముగాదునమ్ము నిను కృష్ణా. 6

శా. మున్నెవ్వాడనొ వెన్క నెవ్వడనొ నామూలంబు నేనే యెరుం
గ న్నాకర్మము మంచిదో చెడుదొ యజ్ఞత్వంబునం గొట్టికొం
చున్నార్డ బ్రకృతావతారమున నెట్లో యెప్పుడో కాన నా
యన్నా యీభవవార్ధి దాటు టది కృష్ణా. 7

శా. సంసారంబనుదానిలోనఁ గలదే సౌఖ్యంబు మూఢాత్మకుల్
హింసాధిక్యమటం చెరుంగకయు దారేచ్ఛా ధనేచ్ఛాది వి
ధ్వంసంబుం బొనరింపలేకయుఁ దదాభాసంబు మన్నించుచుర్
హంసల్ పుచ్చెద రేమివింత యిది కృష్ణా. 8

శా. జ్ఞానానందమయుండ నీ వొకడవేగా నిచ్చయో నీకు న
ట్లైనర్ స్వార్థపరాయణత్వ మది నీయందే ప్రవర్తిల్లె న
జ్ఞానగ్రస్తులకుం బరోపకరణేచ్ఛల్ పుట్టునే యేల నీ
యానర్ నేర్తువు చిత్రచిత్రములు కృష్ణా. 9

శా. వానం జాణవు నీవటం చెరుగుదున్ బ్రహ్మాండభాండంబులన్
వానిర్ గాల్పఁగఁ గుమ్మరామ మగుచున్ వర్తిల్లుఁ దాపత్రయం
బౌనౌ సంతసమాయెఁగాని నిరతం బక్కుండ నత్తాపమం
దే నెక్కొల్పిన కుమ్మరిం గనను కృష్ణా. 10

శా. చీమందోమను బ్రహ్మనుర్ శివుని రక్షింపం దొరంకొంటి వీ
వౌ మేలే మరి కామ లోభ మదమోహక్రోధమాత్సర్య వి
భ్రామంబుల్ మెడగట్టి యేచెదవు సొంపా యాత్మకింపా జగ
త్స్వామీ వింతలు నీ చరిత్రములు కృష్ణా. 11

శా. జన్మంబెట్టిదో నీవెఱుంగవుకదా సంసారతాపత్రయం
బు న్మున్నే కన వెన్నఁడుఁ దుదియునుం బొందంగబో వుర్వియం
దు న్నాకుం గల బాధలం దెలియలేదో భుక్తపూర్వంబె యై
న న్నమ్మిట్టు లుపేక్షసేయుదువె కృష్ణా. 12

శా. క్షుత్తుం దృష్ణయు బెట్టితేల కుడువం గ్రోలంగ జీవి వ్రజో
చ్ఛిత్తిం జూపగ నేల హింసన మొగిన్ జేచేతుఁ జేయకే
వృత్తిన్ మందుము దాని పాచితములౌ కృత్యంబులం జేయ కీ
షత్తైనం దురితంబు నెట్టుదుమె కృష్ణా. 13

మ. అహహా నీపను లిట్టివం చెరుగ శక్యంబే విష ప్రాణియౌ
నహిఁ భేకము భక్షమయ్యె సహజవ్యావృత్తుఁ లోకమం
దహితుండౌ బలహీను గ్రూరమతి యత్యంతక్రుధోపేతఁ
బ్రహరింపంగ నదేల పాపమగు కృష్ణా. 14

మ. భువనంబేలెడివాఁడొకండు మరి యా భూమీశునిఁ గొల్చుచుఁ
గవలంబుఁ దినువాఁడొకం డతనికిం దాసుండొకం డాతనిం
బవలున్ రేయియు నాశ్రయించు నతి యల్పప్రాణి యొక్కండుగా
నవరింపఁ ఫలమేమి యిందు నగు కృష్ణా. 15

శా. నారుం బోసినవాఁడు నీరొసఁగఁడే నావంటి దీనుండ యా
సారం బొప్పగ బ్రోవకున్న మరి యేసంసారి నాతోడునీ
డై రక్షించెడి నంధుడంధుని సహాయత్వంబునుం బొంది పె
న్దారిం బో సమకట్టినట్టులగు కృష్ణా. 16

శా. మన్నుఁ నీళ్ళను నిప్పు గాడ్పు నభముఁ బట్టించి బల్ నేర్పుతో
నన్నుం జేసితి వొక్క బొమ్మను సరే నాచేయు కృత్యంబు లె
ల్ల న్నీకృత్యములేకదా యయితి నేలా కర్తనే నీదు మా
య న్నాబోటు లెరుంగజాలుదురె కృష్ణా. 17

శా. ఎన్నే జన్మములెత్తి యెత్తి తుదలే కీరీతి నీజన్మమం
దున్నార్డ జగమందు నానడత మేలో కీడొ నీయిచ్ఛలే
కున్నా జేయున దేమియున్నది మదుద్యోగంబు లెల్లన్ భవ
త్సాన్నిధ్యంబున జక్కజేయుమిక కృష్ణా. 18

మ. కొఱుదుం గోడను నల్లిమంచమున గొక్కుం గాదె బేనుం దర్ల
బిఱుదుం బాలనొసంగు నాబొదుగునం జిట్టెల్క జూర్ర విజృం
భణవృత్తిం జరియించి బాధ లొనరింపజేయు నీకార్యల
క్షణమే లోకమునం దఘం బిడుట కృష్ణా. 19

మ. కలదే నీకును బక్షపాత మటులం గాకున్న నొక్కండు భూ
వలయం బేలగ నొక్క డాకలములం బక్షింపనేలా మహా
బలు డొక్కండు కృశుం డొకండు మరి సంపన్నుండొకం డెంతయుం
జడుఁ డొక్కండయి యుండ నేమిటికి కృష్ణా. 20

శా. కాకిం గోయల కూసి నట్టులనె చక్కం గూయగా జేసినన్
నీకే బాధకమో యెరుంగనుగదా నీయింద్రజాలంబు నీ
కేకాకెవ్వనికిం దరంబు మది నూహింపంగ భేదంబు ల
య్యా కల్పింపగ నేటికో తెలియ కృష్ణా. 21

శా. నన్నాయింద్రియపంచకం బనెడి దొంగల్ గొట్టి మోహాంధతన్
గన్నుల్ గానను సంచితాఘముల రొక్కంబేల చిక్కించుకో
రన్నా జ్ఞాన లవంబు బోచికొని రేమందున్ విచిత్ర ప్రభా
వౌన్నత్యంబగు నీ ప్రభుత్వమిది కృష్ణా. 22

మ. తెలివా సన్నము గర్వమావలము నీ దివ్యాంఘ్రి సేవారతుల్
తలజూపం దలపెట్టరావు వనితా రమ్యాననా వీక్షణా
దులపై గోర్కులు మెండు భక్తజనులం దూషించి దుష్టావళిన్
గలయంబోయెద నెట్లు మాన్పెదవొ కృష్ణా. 23

శా. నీకున్మ్రొక్కెద నిన్ను గొల్చెదను నానేరంబు మన్నింపవే
నా కేమార్గము జూపెదో యడవిలోనం బెట్టెదో పత్తన
ప్రాకారాంతరమందు నిల్పెదవొ నీ భక్తుండనై యుండగా
నా కేలోపము తెల్పుమా యికను కృష్ణా. 24

శా. నీపాదాబ్జము నమ్మినాడను దపోనిష్ఠన్ సహస్రంబులే
లా పాండిత్యములేటికిం ధనము లేలా రాజ్యభోగంబు లే
లా పూర్వార్జిత పాపసంచయమునెల్లం ద్రోచెదన్ దావకీ
యాపారేర్ధ దయాసముద్రమున కృష్ణా. 25

శా. నిత్యం బెయ్య దనిత్యమెయ్యది సదా నీవొక్కడై యుండగా
నత్యాశ్చర్యముగాదె వేరొకటి నీయం దున్నదన్నం దదీ
యాత్యాగంబు పొసంగుసన్న సకలవ్యాప్తం బనిత్యంబు నా
సత్యం బెట్లగు సత్యనిత్యుడవు కృష్ణా. 26

శా. వాంద్రు న్వీంద్రును మీరు మేమను వృధగ్భావం బసత్యంబ పె
క్కంద్రే నిక్కమటంచు నొక్కకరి ప్రక్కన్ శూన్యమే యుండునం
చం ద్రా శూన్య మశూన్యమౌట యెటు లాహా చిత్ర మూహింపగన్
తంద్రీ యద్వయసత్స్వరూపుడవు కృష్ణా. 27

మ. సగుణత్వంబును నిర్గుణత్వమును నిచ్ఛారూపకావస్థలై
తగు నీకున్ సగుణస్థితిన్ భువన విస్తారంబు గల్పించ పెన్
వగలెల్లన్ జగమెల్ల నింపెదవు నానా నామరూపాదులన్
దగులే దాసుడ నన్ను నేలు మిక కృష్ణా. 28

మ. నిను సేవింపని దుర్జనుండు జడులన్ సేవించు నీవందనం
బును గావింపని మూర్ఖు డల్పుల పదంబుల్ పట్టు నీ సత్కథల్
వినగా నోపనివాడు వారవనితాలీలార్థముల్ వీనులన్
బనిగా నించు గృతాంతు జేరుట కృష్ణా. 29

మ. పనిలేకున్నపుడైన ద్యూత మృగయావ్యాపారముల్ గైకొనం
జనుఁగా కజ్ఞుఁడు నిన్ను బాడ నినుమెచ్చున్ నిన్నుసేవింప నీ
యనఘప్రాభవలీలలన్ వినఁగ రాడయ్యో వరాహంబు చం
దనముం గోరునె పెంట గోరుక్రియఁ గృష్ణా. 30

శా. ఆనందంబున నిన్ను బాడికొనుచున్ హా యీశ్వరా కిల్బిషా
త్మాన మ్మామవ యంచు గద్గదికతో దైన్యంబుతో నోర్పుతో
మేనెల్లం బులకాంకురంబు లెనయన్ బ్రేమంబుతో భక్తితో
ధ్యానంబున్ బొనరించు భక్తుఁడిల కృష్ణా. 31

శా. నే వేదంబులు వల్లెవేసితిని నేనే శాస్త్రవాదంబులన్
గావింపంగ సమర్థుఁడన్ గవిని నేనే నాటకాలంక్రియా
ప్రావీణ్యంబన నాదకా యనుచు గర్వచ్ఛన్నచిత్తుల్ తుదిన్
దావుం గానరు నీకటాక్షమున కృష్ణా. 32

మ. నిను భక్తావనదీక్షు శుద్ధు నచలుఁ దివ్యుఁ గృపామూర్తి న
త్యనఘుం జిత్తమునందు నిల్పికొని నిత్యధ్యానముం జేయ కా
ధనదారాది విచారభారమున బధంజిక్కు మూఢుండు నీ
ఘనకారుణ్యము జెందగా గలఁడె కృష్ణా. 33

శా. త్రోలుంబొమ్మకు త్రాళ్ళు గట్టి దెసలం దూలించి యాడించినం
గాలుం జేతులు ద్రిప్పు నవ్వు నెగయుం గయ్యంబులం జేయుఁ దా
వ్రాలుఁ లేచును గూరుచుండునటు లొప్పఁ సూత్రముఁ బూను నీ
యాలం బంబున లోకులాడుదురు కృష్ణా. 34

శా. నీమాటల్ శ్రుతులాయె నీసుతుడు వాణిఁ నోటనే యుంచె నీ
ధామం బంచితవల్ల వీజనకరోద్యద్వల్ల కీసుస్వరో
ద్దామం బాయెను నీవు నిత్యమును శబ్దబ్రహ్మరూపుండవే
నామాటల్ నిను మెచ్చ నెంతటివి కృష్ణా. 35

శా. మాయాతీతుడవైన నీవు మముర్లఁమాయం బడంద్రోయఁగా
న్యాయంబా విమలప్రబోధ మమితంబైయుండ నద్దేల మా
కీయంజాలవు లోభముం గలదె నీకీవింత లేమందు నీ
సాయంబే మది నమ్మియుంటిఁగద కృష్ణా. 36

మ. కులముం గోత్రము తల్లి దండ్రులును నీకుఁ గల్గిరే లోకముల్
కలిగింపం దొరకొన్ననాటి కెచటన్ గాలూనితో గాయముం
గలదో నీకునుఁ గోశపంచకము నన్నప్రాణముఖ్యమ్ము లెం
దలరెంబో యిది దొడ్డగారుడము కృష్ణా. 37

మ. కొమరుం బ్రాయము గోడెకానితనముం గోపీజనంబుల్ వినో
దము రాసాదికచేష్టితంబులును రాధాసంగమానంగ సౌ
ఖ్యము కర్ణామృతవేణుగానము భుజంగప్రాశిపింఛావతం
సము నేతాదృశలీల లేమిపని కృష్ణా. 38

మ. తెలియం జాలను నన్ను నే నకట నీ దివ్యప్రభావంబులం
దెలియంబూనుట పిచ్చుగుంటు తమ నద్రిం గూటముల్ మెట్టనం
జులువెట్టం దొరకొంట జాడ్యకృతపాశశ్రేణి బంధించి న
న్నలయింపందగునే నతుండగదె గృష్ణా. 39

శా. నేరం బేమియొనర్చినాడ నయినన్ నీబిడ్డగానా యికె
వ్వారల్ నన్ను భరింతు రేది గతి తాపగ్రస్త సంసార పా
థోరాశిం బడద్రోచి వేడుకను గాం తోగిల్లి ముద్దో మహా
ప్రారంభుం డెదిసేయలేడు తగు గృష్ణా. 40

మ. అవురా తెల్వికొరంత యాసలకు లే దంతంబు మర్త్యాళి కి
త్తె వులుం బెట్టుట కెద్ది కారణము పృథ్వీఁ గాళ్ళుచేతుల్ మొలం
గవునుం బొజ్జను గుత్తుకఁ బుజముర్లఁ గావించి శీర్షంబు గూ
ర్చవు సీ మొండెపుబొమ్మ లేమిపని కృష్ణా. 41

మ. నను నీచుం జనియింపజేసితివి యజ్ఞానాంధకారంబులో
మునుగంజేసితి వార్వుర౯ రిపులము న్మ్ంబెట్టి తాపత్రయం
బున గూలం బడద్రోచితీస్థితిని౦ దప్పుంజేసె వీడంచు నిం
కను నాకు న్నరకంబు దప్పదొకొ కృష్ణా. 42

మ. తృణమ్ము౯ మేరువు చీమయ్యు౯ విధియు బృధ్వీగోళముం గొంచెమౌ
నణువ్యు౯ గాలియు సంద్రమ్ము౯ సురపురం బాసత్యమున్ సొంతముల్
గణియింపం గుణసంగవృత్తులయి యేలా యాశ కంతంబు లే
దణుమాత్రంబును గారణంబెరుగ కృష్ణా. 43

మ. పదివేలేండ్లు తపంబుజేసినను నీభక్తుండు గాకెట్లు భా
స్వదురుజ్ఞానసమేతుడయ్యెడిని నీ స్వత్వంబు జ్ఞానంబు దు
ర్మదమోహాంధులగొల్చి తంత్రగత ధర్మంబుల్ గొనంగజాలు గా
కదిరా నీ కలిమిం గనందరమె గృష్ణా. 44

మ. పశుపాలత్వము బూని గోజగతిలో వాసంబు గావించుట౯
విశదంబే భవదీయవృత్తి పలుకన్ వేయేల మర్త్యాళినాన్
బశుసంఘంబు తదీయరక్షణమున౯ దండాధికం బొప్పు స్వీ
యశుభాశా సహితంబు పాశవము కృష్ణా. 45

శా. ఏదో కొంచెము జ్ఞానమిచ్చితివి నే నీజ్ఞానలేశంబుతో
నీదన్ బుద్దను నమ్మి యేటబడినట్లే దుఃఖపాథోనిధిన్
బ్రాదుర్భూతభవద్దయాప్లవము సంపాదింపలేనా సదా
నాదానంద వినోదవిశ్వనుత కృష్ణా. 46

మ. ధరణిం బెబ్బులి౦ గాంచి జంబుకము వాతంబెట్టుకొన్నట్లు భా
స్వర విజ్ఞానులబోలె నేను దపముం జల్పం దొరంకొంటి నా
తరమా నీ మహిమంబెరింగికొన గంత౯ గన్నులంగట్టి తె
న్నరయంబూనుటగాదె నాతపము కృష్ణా. 47

శా. ఎట్టో నీగుణవర్ణనంబు గనలే నే జాడ నీపాదముల్
బట్టంగల్గుదు మోహపాశములచే బద్ధుండనై యుంటి నే
తట్టుంబట్టెద నుట్టికిన్నెగయ జేతంగాదు స్వర్గంబునుం
గట్టా బట్టెదనే దయం గనుము కృష్ణా. 48

శా. కోర్ర రాజ్యము భోగముల్ర గజముల్ర గుఱ్ఱంబుల్ర బ్రోన్నతా
గారాట్టాలక గోపురధ్వజములం గాంతా కుమారార్థముల్
జీరెల్ భూషణముల్ భవత్పదరజోలేశంబు నే గోరెద్ర
జారుశ్రీ నిడికొందు మస్తమున కృష్ణా. 49

మ. చిఱుతన్ జ్ఞానవిహీను దుష్టచరితున్ క్షీణక్రియన్ గోపనుం
బెఱలన్ మోసము సేయువాని గఠినుం బేదం దురాచారునం
దరు దూరందగువాని బందను నిరర్థప్రక్రియున్ నన్ను గ్ర
చ్చుఱ నెట్లేలెదవో యెరుంగగదె కృష్ణా. 50

మ. బరువా తీగెకు గాయ నీవలన రూపం బందితిర్ నీవకా
కొఱు లెవ్వారు భరింత్రు నన్ను మహనీయోద్యోగబాహుళ్యత్ర
మరతే యిట్టు లఖండ బోధహితసామర్థ్యం బబద్ధంబె క్ర
చ్చుర గారుణ్యముగల్గి యేలు మిక కృష్ణా. 51

శా. క్రోఁతిం బ్రహ్మను జేయు నీకరుణకుం గ్రూరున్ సదాచారవి
ఖ్యాతుం జేయుటె దుస్తరంబె భవితవ్యం బెట్లుగా నున్నదో
యాతంకం బిక నేమి యట్లయగు నీ యంఘ్రిద్వయిర్ మాన వి
శ్వాతీతాత్మక నన్ను నేలు మిక కృష్ణా. 52

శా. పాల్ర ముంచెదొ నీళ్ళముంచెదవొ నీపాదాబ్జముర్ నమ్మితిం
జాలన్ మ్రొక్కగ గాళ్ళ దన్న దగునే సర్వేశ నా పాపముల్
వ్రీలం జేయవె మోహపాశముల పేర్మింగోసి రక్షింపవే
చాలున్ నీదు వినోదవైఖరులు కృష్ణా. 53

మ. హరి భక్తాగ్రణి యంచు బేర్వడిన బ్రహ్లాదుండు నీకేమి చు
ట్టరికంబుం బ్రకటించె నే మొసగె గట్టా నాయదృష్టంబెకా
కరవిందాసనుభ్రాలు నానొసట బాగైయున్నదో లేదొ యె
ట్లరయంబోయెద మ్రొక్కెదం గనుము కృష్ణా. 54

మ. పరమప్రీతి భవత్పదాబ్జనతులన్ భావించు వజ్రాంగివై
స్పురితజ్ఞానికి జీవగఱ్ఱవయి సంభూతాఖిలాండవ్రజో
ద్ధరణోద్వృత్తికి బ్రహ్మకాయవయి మాత్సర్యగ్రహస్తంబు దు
ర్నరరింభోళికి బ్రాణగొడ్డమవు కృష్ణా. 55

మ. స్వజనుండంచు బరుండటంచు గలదే స్వామీ చిదానంద నీ
కజరుద్రాదులు స్వీయులా వ్రజగణంబా యార్తులా భక్తులా
సుజనోత్తానములా యనంత ముఖులౌ సూర్యగ్రహవ్రాతమా
త్యజియింతే యటులైన మమ్మరక కృష్ణా. 56

శా. కర్మారంభుండె మానవుండైనచో గవ్వంతయున్ లేదు నా
యోర్మిన్ నీభజనంబునన్ ఫలము నీవుద్యోగివై కర్మముల్
బేర్మింజెంద నశింపజేయగల వేనిన్ బ్రోవుమీ నన్నికన్
స్వర్మానుష్యపదంబు లేమిటికి కృష్ణా. 57

శా. తప్పా నాది భవత్పదాబ్జములచెంతంజేరి నీవాడ నా
యప్పా యొప్పులకుప్ప రాగదర మోహాంబోధి దాటించు మేల్
తెప్పా యంచును విన్నవించుకొనుచున్ దీనుండనై వేడుటల్
చప్పుళ్ళేటి కటంచు ద్రోయకుము కృష్ణా. 58

శా. మొఱ్ఱో దేవుడ కావుమా భవభయంబున్ దీర్పుమా వేగమే
వెఱ్ఱో మొఱ్ఱియొ నీపదాబ్జములు సేవింపం దొరంకొంటి నే
జిఱ్ఱుం బస్పు మటంచు గోపమున నీక్షింపంగబో కట్లయే
నఱ్ఱెత్తంగలనే కృపంగనుము కృష్ణా. 59

శా. పెట్టం గర్తవు కొట్టగర్తవు తగుంబే నీకుస్వాతంత్ర్య మి
క్కట్టుం బొందెడినాడు సేవకు నుపేక్షం ద్రోయగా జెల్లునే
యెట్టున్ నీకును ధర్మమెక్కడిది యంటే బూర్ణవిశ్వాసముం
గట్టా నీయడ నెవ్వరుంచెదరు కృష్ణా. 60

శా. పెట్టెల్ నించితి సంచితాఘనము నీ పేరెత్తితి న్నేటిక
ద్దట్టే యున్నదె నిన్ను గొల్చినను నా యయ్యా కటాక్షించుమా
బిట్టూరం మొఱవెట్టు నన్నువిడువన్ బేర్వాసినీ కెచ్చునే
నట్టుం జేయక బ్రోవుమయ్య నను కృష్ణా. 61

శా. నీవే దాతవు నీవె త్రాతవు మరిన్ నీవేకదా హర్త వే
త్రోవం జూచిన నీవెతక్క యిక నేరున్ లేరు లేరిందు స
ర్వావ ష్ఠంభుడవీవె నిన్విడచి యే యల్పాశ్రయాలంబమున్
గావింతుం దయజూచి యేలుమిక కృష్ణా. 62

శా. కన్నారన్ నినుజూచి మ్రొక్కి పులిప్రక్కంజిక్కు జోరీగనై
యున్నాడన్ భయమేమి నాకు భవసంయోగంబు బాధించునే
యిన్నాళ్ళుంబలె నట్టులేయయిన నీ యీశత్వమున్ నీ ప్రభా
వౌన్నత్యంబును మెచ్చువారెవరు కృష్ణా. 63

శా. రాధాదేవి సమస్తమైన యుపచారంబుల్ తగం దీర్పగా
మేధావుల్ గరుడాదు లూడిగముల న్మెప్పించగా రచ్చలో
వేధోముఖ్యులు స్తోత్రపాఠములు గావింపంగ గోలోకమం
ధాధోరోన్నత సింహపీఠి దగు కృష్ణా. 64

శా. పూలుం బత్తిరి తెచ్చి నీ శిరమునుం బూజింపగానైన నే
జాలన్ సర్వలతాప్రతానసుమభూజభ్రాజి వేధోండముల్
నీలో నుండగ నీకు బూలిడుటకంటెన్ వెట్టి వేరెద్ది మి
ధ్యాలాలిత్యము సూపనేమిటికిఁ కృష్ణా. 65

శా. నైవేద్యంబును బెట్టనేరజుమి నానాలోకసంవాసులౌ
జీవుల్ నీ విడునట్టి యన్నమున నే జీవించుచుండంగ శు
ద్ధావజ్ఞత్వము సూపనేమి ఫల మాహారంబు నీకిచ్చి నా
వ్యావృత్తు ల్భవదంఘ్రిసేవ లిఁక కృష్ణా. 66

శా. దారుల్ కొట్టెడివాని కర్థము నసత్యవ్యగ్రవాగ్వాది కా
గౌరౌన్నత్యము నిర్దయాత్ములకు భోగంబుల్ నరఘ్నాళికిం
భూరాజ్యంబును నిచ్చి నీదు చరణాంభోజాతమున్ నమ్మ నన్
బారందోలుట నీకు ధర్మమొకొ కృష్ణా. 67

శా. నీచాతుర్యములెల్ల దోచెడి జగన్నిర్మాణవైచిత్రి గా
ర్యౌచిత్యంబున శబ్దరూపరసగంధాదిప్రసంగక్రమ
ప్రాచుర్యంబున జంతుసంతతి గ్రియారంభంబులన్ గాన నే
యాచింతున్ భవదీయ సేవనము కృష్ణా. 68

శా. పోరుం బెట్టినగాని బాలునకు నీ బో దంబ దుగ్ధంబులన్
ధీరోధారుడవైన నీవు పరమార్తిం జిక్కియున్నట్టి న
న్నేరీతిం బరికించెదో కరుణతో నీక్షించి రక్షించు మ
య్యా రాజీవదళాక్ష దేవహిత కృష్ణా. 69

శా. నీమాహాత్మ్యము సర్వలోకసమితి న్నిండెన్ నిరాతంకమై
నామందత్వము నన్నెపట్టుకొనియుండం జెల్లునే నీలస
న్నామోచ్చారణఁజేసి దాని దరుమంగాలేనె యోరాధికా
స్వామీ లోకహితైక కార్యభర కృష్ణా. 70

శా. ఒల్లన్ దుఃఖమయంబు నీచమును నౌ నుర్వీశ్వరత్వంబు నే
నొల్లన్ నిత్యముగాని స్వర్గపద మత్యుత్సాహముం బొందెదన్
త్వల్లీలాకథనంబు ద్వద్భజనమున్ ద్వద్దాస సాంగత్యమున్
గల్లల్ గావు కృపాబ్ధిదేల్చుమిక కృష్ణా. 71

శా. భక్తశ్రేణికి పట్టుకొమ్మ వనిచుఁ బ్రార్థించితిన్ నిశ్చలా
సక్తిన్ నాకది దోషమా యికను నీ సామర్థ్య సౌలభ్య సం
యుక్తిం జూచెదగాక నీయశము కల్లోనిక్కమో యేది నీ
శక్తిం జూపుము నన్ను బ్రోచుటకు కృష్ణా. 72

శా. కృత్యాకృత్యవిచారమింతయును లేదీలోకమం దంతయున్
జాత్యంధుంబలె నేదియుం గనక రాజ్యంబేలుటేపాటి నీ
భృత్యత్వంబువహించి కొల్చుచును సంప్రీతిన్ మహాజ్ఞాన ని
ష్పత్త్యుద్దాముడనౌట మేలుగదె కృష్ణా. 73

శా. నీ నామస్మరణంబు గోరును మృడానీభర్త హాలాహాల
స్థానంబైన గళంబుచే దుడుగనో సర్వామరుల్ కోరనే
లా నేనెంచెద గట్టిగా నమృతధారామాధురి న్మించెనం
చానందాత్మత చిత్కళాసహిత కృష్ణా. 74

మ. అవతారంబుల నెత్తియెత్తి కుజనవ్యాపారముం జేసిచే
సి విధానజ్ఞుల నేలియేలి బలుగాసిం జెందనేలా రమా
ధవ గోలోకసుఖంబుకంటె భువనత్రాణంబు నీకెక్కువా
యవురా నీదయ కట్లు సేయదగు కృష్ణా. 75

శా. ఆడంబాడగలేనినాడు లొకవేయం దిందు గల్పించి నా
ఛేడా నాలుకయొక్కడేయిడితి యే రీతిన్ భవత్కీర్తన
క్రీడందేలుదు నీదుమెప్పువడయం గించిజ్జుడ న్నన్ను నే
జాడన్ బ్రోచెదొ నీదె భార మిక కృష్ణా. 76

శా. పప్పుల్దప్పళము ల్భుజించి కడుపుల్ పైపైకిఁ బొంగారగా
పప్పుల్ సాపడి త్రేపిత్రేపి తనువుల్ పాలింతురే లబ్ధికై
మొప్పుల్ ముప్పున నిప్పునం బడగనో భూస్థాపనం జేయునో
యప్పాతం బొనరింపనో యెరుగ కృష్ణా. 77

శా. సాధుశ్రేణి భవన్ముఖోదిత మహాశబ్దప్రమాణజ్ఞులై
యాధివ్యాధిజరామరాదిమయ కాయం బాసలోనుంచ కో
రాధానాథ ! రథాంగపాణి! యనుచుం బ్రార్థించి ముక్తాశులై
సాధిం త్రచ్యుత దివ్యబోధనమును కృష్ణా. 78

మ. అనవచ్ఛిన్నము దేశకాలములచే నాద్యంతశూన్యంబు చి
ద్ఘనమున్ సత్ప్రచురంబు సంతతసుఖ స్థానంబు బ్రహ్మం బటం
చును వేదాంత రహస్యముల్ తెలుపు నన్నుంగూర్చి బ్రహ్మాహమం
చననో భక్తుడనై మెలంగుదునొ కృష్ణా. 79

శా. నీలో నైక్యమునొందుటే సుఖమొ నే నీసన్నిధిం జేరి యి
ష్టాలాపంబుల బ్రొద్దుబుచ్చుటయ శ్రేయంబో విచారింపగా
జాలన్ నా కెటులైన నిష్టమె యదోషంబైన సౌఖ్యంబు నా
కాలీలం ఘటియింపజేయు మిక కృష్ణా. 80

మ. విలసద్భావరసాద్యలంకృతులతో వృత్తంబులం జెప్పి ని
న్నలరింపంగలవాడఁగాను మరి యుద్యద్వల్లకీ వేణుగా
త్రల సద్గానముచే స్తుతింపగ సమర్థంబు లేదెట్లు న
న్నలసుం జంచలు నజ్ఞు నేలెదవు కృష్ణా. 81

మ. పలుమాట ల్పనియేమి దర్శనము లొప్పన్నేర్చి వాక్యార్థముల్
వెలయింపంగలవారు నిన్నుగను తెల్విం గోరియేకాదె యు
క్తులు ప్రత్యుక్తులు పూర్వపక్షవినియుక్తుల్ శుద్ధరాద్ధాంతముల్
గలయంగొట్టుదు రేనుభక్తుడను కృష్ణా. 82

శా. అద్వైతంబని ద్వైతమంచని విశిష్టాద్వైతమంచున్ మహా
విద్వాంసుల్ పలుపోకల న్నడచి రా భేదంబు లజ్ఞానకా
ర్యద్వేషాశ్రయము ల్తలంప నరుడె ట్లైనం భవత్పాదకం
జద్వంద్వంబును బట్టగావలయు కృష్ణా. 83

మ. అవనిం దారులు నూరు జూపడిన గమ్యస్థాన మొక్కండయై
తివురంగానమె నీవె గమ్యుడవు నాతెన్నుం బొడంగాంచి యి
ప్పొవరుంగొన్నగరాసి మానిసిని తప్పుం బెట్టెదో మూర్ఖ మా
నవుర్డ వచ్చితి నెట్టులో దరికి కృష్ణా. 84

శా. దివ్యజ్ఞానము సున్న నీచరణ భక్తిన్ దీపి మెండాయె బల్
దివ్యజ్ఞానమె మేలు నీచరణభక్తిన్ దీపి మేలో సదా
దివ్యజ్ఞానము నీదె నీచరణభక్తిన్ దీపినాదే యికన్
నవ్యానందము నీవు నాకిడుము కృష్ణా. 85

శా. మంచో చెడ్డయొ నిన్ను వేడితిని శుంభత్సంభవాంభోధిలో
ముంచో ముంచకయో భవచ్చరణముల్ పూజించి సేవించి నీ
పంచన్ బానిసమానిసిం జలుపుమీ ప్రార్థించెదన్ నన్ను దు
స్సంచారంబుల బెట్టబోకు మిక కృష్ణా. 86

మ. రతనంబుల్ గలచోటనే కలవుగా రాళ్ళందులో భేద మే
గతి బ్రాపించె నెరుంగ శక్యమె సుధాకల్లోలినిన్ ద్రచ్చ ను
న్నతి హాలాహల మెట్లు పుట్టె నవురా నానాత్వముం గారణై
కృతయున్ నీపనులందె గానఁబడు కృష్ణా. 87

శా. నీదేమాయలమాయదే సకలమౌ నీరేజగర్భాండ మిం
కే దిందున్నది పాలదే పెరుగు స్వామీ పెర్గుదే చల్ల యు
న్మాదగ్రస్తుల మైతి మే మది భవ న్మాయామహత్వంబె దే
వా దీనుండను నన్ను బ్రోవుమిక కృష్ణా. 88

శా. నీతుల్చెప్పగ నేర్చు దండమును బాణిం బెట్టగా నేర్చు వి
ఖ్యాతప్రౌఢి బశుప్రఘాతమును జేయన్ నేర్చు నీయందునున్
జేతోవృత్తిని నిల్పి నిశ్చలత ధ్యానింపండు వాడెట్లవి
ద్యాతీతుండగు దెల్పవే కరుణ కృష్ణా. 89

శా. నిన్నుం గీర్తనసేయఁగా శ్రుతులకున్ వేదాఖ్య వచ్చెంగదా
యెన్నంగా విది ధాతువర్థము మఱొండే జ్ఞానమేకాక నా
యన్నా నిన్నును గొల్చువారలకు జ్ఞానాధిక్యమే లాభమౌ
నన్నుం జ్ఞానినిజేయ వేమిటికి కృష్ణా. 90

శా. నీకాలేటికి మాయగాక కలిసెన్ నీతోడ నైక్యస్థితిన్
జోకంబూనెడి రాధకానియది యస్తోత్తంబుగా బెత్తనం
బాకట్టెం జగదండగేహమున మా కావంత సందీదు నిన్
వైకుంఠేశు భజించు టెట్లికను కృష్ణా. 91

శా. ఏలోకంబున నీవులేవు సకలం బీవున్నచోటేగదా
గోలోకంబున బ్రీతి మిక్కుటమె నీకుం జూడ గార్హస్థ్యధ
ర్మాలంబంబును సేవక ప్రజవినోదార్థంబులున్ మెండటం
చాలోచించెద నన్నుబ్రోవు మిక కృష్ణా. 92

శా. ఇల్లుం బెళ్ళము గొడ్డు దొడ్డీ మడి తో టేర్రుఁ సమస్తంబు రం
జిల్లంజేసుక గోప్రపంచమున నున్కింబెట్టి సంసారివై
యుల్లాసంబున భక్తసంతతులతో నొప్పార నీభాగ్యమే
చల్లంగా మము నేలుగావుతను గృష్ణా. 93

శా. నీవేకాక మరెవ్వ రీజగమునఁ నీచిక్కు విప్పంగలా
రీ విశ్వంబున విత్తెముందొ మరి చెట్టే ముందొ సాధింప స్వే
చ్ఛావాదంబులు చేసి చేసి యనవస్థన్ జిక్కిరే కాక వి
ద్యావంతుల్ కనఁజాలిరే తెలుపు కృష్ణా. 94

శా. శృతి బ్రామాణ్యము నీ స్థితంబునకు నాశృత్యర్థము న్నీవ ప
ల్కితిగానన్ మహితప్రమాణత గనెన్ గీర్తింప నున్నాద వి
చ్ఛతి బెండ్లౌ మరి బెండ్లికిన్ బిదప నే శాంతిల్లు నున్నాద నిం
ద్యత యన్యోన్యము నాశ్రయంబులగు కృష్ణా. 95

శా. మార్కు గంటికి గానరాని యణువుల్ మాన్యు నిర్ము లోగొన్ము
లోకేశాండకరండమండలము నీలో నుండు నీ వాదియో
లే కాదిం బరమాణుపుంజము లసల్లీలం బ్రకాశించెనో
నా కేరీతి నెరుంగ శక్యమగు కృష్ణా. 96

శా. తిరమా భోగము సత్యమా జగము నీ దివ్యాంఘ్రిపంకేజ బం
ధురమాధ్వీరసపానమత్తుల కుపాధు ల్లేవు నిత్యుల్ నిరం
తర గోలోక సుఖావహప్రచురబోధాశాలులై యుంద్రు వే
దరహస్యార్థము లెత్తిచెప్పెదను కృష్ణా. 97

శా. సుతుడుం దండ్రియు బెండ్లము మగడు రాజుం బంటు మా మల్లుడుం
హితుడుం స్నేహితుడుం బురోహితుడు గేహి శ్రేష్ఠ దన్యోన్యసం
గతి సమ్మర్శము మాని పోరుదురు నిక్కంబర్థలోభంబునం
గతి నీవే యనువాని కేవెఱపు కృష్ణా. 98

శా. ఓగుం బాగులు నీవెరుంగవని నేనూహింప నన్నేల భూ
భాగంబందు జనింపఁ జేసితివొ నావల్లం ఫలంబేమొ యే
లా గెచ్చో నెపు డేది చేసెద నదెల్లం నీకె జ్ఞాతంబు నా
నాగోప్యార్థము లున్నపేటికవు కృష్ణా. 99

శా. ప్రావృణ్మేఘము పట్టుమన్న బచరింపంబోదు వల్దన్న ధా
రావిస్తారము మాన దట్టులనె యౌరా నీకృపాధార రా
ధావామాధరబింబకీర పటుబోధాశూర ధీరా నను
గావం మ్రొక్కెద జూడరా యికను కృష్ణా. 100

శా. పినతాతల్ కపిలర్షి శాపమున నిర్భిన్నాంగులై భస్మమై
చన రత్యున్నతలోకవాసమునకుం స్వామీ కృపాధారతో
డను గంగాలవమిచ్చి ప్రోవగదె శ్రీ ధామా పితౄణంబు వా
యను నీవేగతి యంచు నమ్మితిని గృష్ణా భక్తకల్పద్రుమా. 101